క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీవో గంగాధర్

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో గ్రామ పంచాయతీ, ఈజీఎస్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని సోమవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. నర్సరీలో నాటిన మొలకలను పరిశీలించారు. మొలకలు ఎండిపోకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీలో పండ్లు, పూలు, టేకు మొక్కలను నాటించేలా చూడాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువులు తయారు చేయాలన్నారు. ఆయన వెంట టీఏ ప్రసాద్, ఎఫ్ఏ నర్సింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాజధానికి ఎక్స్‌ప్రెస్ బస్ నడపాలని వినతి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం నుంచి ఉదయం 5గంటలకు, రాత్రి 9.30 గంటలకు గతంలో నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సులను తిరిగి పునరుద్ధరించాలని నాయకులు కోరారు. హైదరాబాద్ నుంచి ఖానాపూర్‌కు రాత్రి 10.15 గంటలకు గతంలో మాదిరి బస్సును నడిపించాలని విన్నవించారు. ఈ మేరకు సోమవారం వైడి రెడ్డిమల్ల ఫౌండేషన్, యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. సభ్యులు ఏసుదాస్, చిత్రలత, షకీల్ ఉన్నారు.

అరుణోదయ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూత



చెక్కు అందజేస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గంధం సుమన్ భార్య రజిత ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకోగా బాధిత కుటుంబాన్ని సుమన్ పదో తరగతి బ్యాచ్ మిత్రులు పరామర్శించారు. అరుణోదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25వేల ఆర్థిక సహాయం చెక్కును సోమవారం అందజేశారు. సభ్యులు సంతోష్, శ్రీనివాస్, అనిల్ తదితరులు ఉన్నారు.

'317జీవో బాధితులకు న్యాయం చేయాలి'



మాట్లాడుతున్న రాజేశ్ నాయక్

కడెం: జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 బాధితులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. నాయకులు జడ ఇందూరు నేత, ఉపాధ్యక్షులు సుద్దాలరాజేశ్వర్, హరీశ్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కడెం: మండలంలోని మొర్రిగూడెం గ్రామంలో నూతన పోచమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. జన్నారం మండల మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తన సొంత గ్రామం మొర్రి గూడెంలో సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో కన్నాపూర్ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాధ సత్యనారాయణ, మల్లేశ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

'విచారణ బహిర్గతం చేయాలి'



మాట్లాడుతున్న సురేశ్

నిర్మల్‌టౌన్: ఖానాపూర్ సీడీపీవో అవినీతిపై జరిపిన విచారణను బహిర్గతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. సీడీపీవోపై జరిగిన విచారణను ఆరు నెలలు గడిచినా ఎందుకు బహిర్గతం చేయలేదో కలెక్టర్ సమాధానం చెప్పాలన్నారు. ఇందులో నాయకురాలు గంగామణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు యూనిఫైడ్ ఐడీ!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మరో 21రకాల కేటగిరీలకు అవకాశం



యూడీఐడీ పోర్టల్

భైంసాటౌన్: దివ్యాంగులకు ప్రభుత్వాలు అందించే చేయూత, ఇతర ప్రయోజనాలకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఇప్పటివరకు దివ్యాంగులు మీసేవా కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకుంటే, శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. కాగా ఇప్పటివరకు జారీ చేస్తున్న సదరం సర్టిఫికెట్లకు ప్రభుత్వం స్వస్తి పలికింది. వీటి స్థానంలో యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డ్) అందించనుంది. ఈ మేరకు స్వావలంబన్ కార్డ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేగా, దివ్యాంగులు నేరుగా ఆన్‌లైన్‌లో లేదా ఫోన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విధానం ఈనెల 1 నుంచే అందుబాటులోకి రాగా, దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

సేవలు సులభతరం..

దివ్యాంగులకు సదరం సేవలను సులభతరం చేసేందుకే ప్రభుత్వం యూడీఐడీ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు సెర్ప్ సీఈవో దివ్య దేవరాజ్ ఇటీవల కలెక్టర్లు, డీఆర్డీవోలు, తదితర అధికారులతో నిర్వహించిన వీసీలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ల కోసం మీసేవతోపాటు యుడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించి ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం వారి ఫోన్లకే మెసేజ్ రూపంలో వస్తుంది. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో ఎలాంటి తప్పు వివరాలు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. ఇప్పటివరకు ఐదు రకాల కేటగిరీల దివ్యాంగులకే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల కేటగిరీలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయిన తరువాత సదరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డు రూపంలో పోస్టల్ శాఖ ద్వారా ఇంటికే పంపించనున్నారు. ఈ కార్డు చేయూత పింఛన్లతోపాటు ఇతర అన్ని సంక్షేమ ప్రయోజనాలకు చెల్లుబాటవుతుంది. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవడం, దరఖాస్తు స్థితి తెలుసుకోవడంతోపాటు, డౌన్‌లోడ్ అవకాశం కల్పించింది.

ఇలా దరఖాస్తు చేసుకోండి..

ఆన్‌లైన్‌లో స్వావలంబన్‌కార్డ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఇందులో అప్లయ్ బటన్‌పై క్లిక్ చేస్తే, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కొన్ని సూచనలుంటాయి. వాటిని చదివినట్లు అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే మరో విండోలో ఐదు ఆప్షన్లు ఉంటాయి. వాటిలో వారికి సంబంధించిన దానిపై క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. పూర్తి వివరాలు నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

ఆలయానికి మేళతాళాలు వితరణ



మేళతాళాలు అందజేస్తున్న రమేశ్ రెడ్డి

సోన్: సోన్ మండల కేంద్రంలో ఇటీవల పునఃనిర్మితమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం మేళతాళాలను నిర్మల్ జిల్లా తిరుమల నర్సింగ్ హోమ్‌కు చెందిన ప్రముఖ వైద్యులు రమేశ్ రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి రూ.15000 విలువ గల మేళతాళాలను అందజేసినట్లు తెలిపారు. గడ్డం నర్సయ్య, గాండ్ల నర్సయ్య, గాండ్ల లింగన్న ఉన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి

దస్తురాబాద్: మండల కేంద్రంలో నూతనంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని సోమవారం డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పీఎం కుసుమ్ యోజన పథకంలో భాగంగా మండలంలోని గ్రామసమైక్య సంఘాల భాగస్వామ్యంతో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సోలార్ ప్లాంట్‌కు కావాల్సిన 4 ఎకరాల భూమిని పరిశీలించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు, డీపీఎం వెంకటప్రసాద్, ఎంపీడీవో రమేశ్, రెడ్‌కో జిల్లా మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐ గంగన్న, ఏపీఎం గంగాధర్, మండల సర్వేయర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు.. ఆదుకోని అధికారులు



ఎండుతున్న పంట పొలం వద్ద రైతులు

కడెం: మండలంలోని ఎలగడప, పెత్తరపు, మాసాయిపేట్, కొత్త మద్దిపడగ, పెద్దూర్, లంబాడి తండా గ్రామాల్లో సాగు చేస్తున్న వరి పంటలకు సదర్‌మాట్ కాలువ సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. గత వారం రోజుల నుంచి తమ పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. నీటి పారుదల శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సదర్‌మట్ కాలువ ద్వారా కడెం మండల ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

భైంసాటౌన్: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు జంగం శశిధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. కాగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రజాట్రస్ట్ చైర్మన్ బి మోహన్‌రావు పటేల్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 5280 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించినట్లు పేర్కొన్నారు.

వ్యాపారం ఏదైనా.. స్కానర్ తప్పనిసరి



ఖానాపూర్: దేశంలో డిజిటల్ విప్లవం సంభవించడంతో నగదు చెల్లింపులకు చిన్నా, పెద్ద వ్యాపారులు ఫోన్‌పే, గూగుల్ పే తదితర స్కానర్లు వినియోగిస్తున్నారు. నిరక్షరాస్యులు సైతం యాప్‌లు, స్కానర్లు వినియోగిస్తూ చిన్న చిన్న దుకాణాలు నిర్వహిస్తున్నారు. మండలంలో మొక్కజొన్న కంకులు, కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు వీటిని వినియోగిస్తుండడంతో విక్రయదారులతో పాటు కొనుగోలుదారులకు చిల్లర సమస్య సైతం తీరినట్టయ్యింది.

బోర్‌మోటార్ చోరీ

కుంటాల: కుంటాల శివారులోని సేవాలాల్ తండా వెళ్లే మార్గంలో ప్రాణహిత -చేవెళ్ల కెనాల్ పక్కన గ్రామ అవసరాలు, నర్సరీలోని మొక్కలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన బోరు బావికి సంబంధించిన మోటార్, స్టార్టర్లు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. గతంలో ఇదే బోరుబావికి సంబంధించిన స్టార్టర్‌లను ఐదుసార్లు దొంగలు ఎత్తుకెళ్లారు. మోటార్, స్టార్టర్ విలువ రూ.20వేల వరకు ఉంటుందని పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కరాచారి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఐకేపీ సీఏపై ఫిర్యాదు

దిలావర్‌పూర్: మండలంలోని కంజర్ గ్రామంలో ఐకేపీ సీఏగా పని చేస్తున్న నిమ్మ ముత్యంపై మహిళలు సోమవారం ఏపీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని స్వయం స్వహాయక సంఘాల మహిళల రుణాలకు సీఏ వద్దకు వెళ్తే దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ దళిత మహిళపై దుర్భాషలాడిన సీఏపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగారాం, రాజేశ్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముధోల్: మండల కేంద్రంలోని స్థానిక గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, లావణ్య తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 338, రెండో సంవత్సరం 276 మంది మొత్తం 614మంది పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ మహ్మద్ అబ్దుల్ మతీన్ తెలిపారు. గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం 370, ద్వితీయ సంవత్సరం 370 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు కొనసాగనున్నట్లు వారు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 9గంటలకే పరీక్షలు ఉన్నందున విద్యార్థులు 30 నిమిషాల ముందే హాజరు కావాలన్నారు.

యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న నరేశ్

సారంగాపూర్: మండలంలోని మహవీర్‌తండాకు చెందిన జాదవ్ నరేశ్ (34) అనే యువకుడు కాలినడకన వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మహవీర్‌తండాకు చెందిన నరేశ్ జామ్ గ్రామంలో తన పనులు ముగించుకుని తిరిగి కాలినడకన వెళ్తున్నాడు. ఇదే సమయంలో స్వర్ణ వైపు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో నరేశ్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో నరేశ్ కాలికి, చేతులకు, బలమైన గాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శివకుమార్

కడెం: మండలంలోని సారంగాపూర్ గ్రామంలో సోమవారం కడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎన్‌సీడీ (అసంక్రమిత వ్యాధులు) వల్ల ఆరోగ్యంపై ప్రభావాలపై డాక్టర్ శివకుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. ఇందులో హెచ్ఈవో వేణుగోపాల్, రాజేశ్వర్, మౌనిక, జ్యోతి, ఆశా కార్యకర్తలు రాజమణి, జహీదాబేగం తదితరులు ఉన్నారు.

చీమల ఆవాసం.. నిర్మాణ నైపుణ్యం



ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదుల సంఖ్యలో చీమల ఆవాసాలు వేపచెట్టుకు ప్రత్యేకతను సంతరించి పెడుతున్నాయి. చీమలు తమ నివాస స్థావరాలుగా అనువైన ప్రాంతాలను ఎంచుకుంటాయి. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు సమీపంలో వేపచెట్టుపై ఉన్న 20 నుంచి 30 వరకు చీమల పుట్టలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. వేడిమి, ఈదురు గాలుల నుంచి సంరక్షించుకునేందుకు ఆకులతో వృత్తాకారంలో ఏర్పాటు చేసుకున్న నివాసాలు చీమల ఇంజనీరింగ్ నైపుణ్యానికి కొలమానంగా నిలుస్తున్నాయి. చీమల నిర్మాణ ప్రతిభ ప్రకృతి ప్రేమికులను అబ్బురపరుస్తోంది. ఈ సుందర దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న నారాయణ్‌రావు పటేల్

కుంటాల: కుంటాలకు చెందిన ప్రముఖన్యాయవాదులు సాదుల సుదర్శన్, గోవర్ధన్, జనార్ధన్ తండ్రి మాజీ పట్వారి సాదుల లింబగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా సోమవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణ్ రావు పటేల్, విఠల్ రెడ్డి, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డిలు కుటుంబ సభ్యులను వేర్వేరుగా పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీలు భోజారాం పటేల్, రామచంద్రారెడ్డి, జుట్టు లక్ష్మణ్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రామచందర్, శంకర్ చంద్రే, కొత్తపల్లి బుచ్చన్న, రమణగౌడ్, జుట్టు మహేందర్, దేవిదాస్, ముత్యం రెడ్డి, జంగం రమేశ్, మధు, మహేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో బద్దెన్న అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నిర్మల్ వ్యవసాయ కమిటీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తాజా మాజీ మండల కోఆప్షన్ సభ్యులు సిరాజుద్దీన్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి, రవి, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన రేపాక వేణు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ సూచన మేరకు స్థానిక నాయకులు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు రాజగంగన్న, ప్రదీప్, చంద్రహాస్, శ్రీనివాస్, శ్రావణ్, దివాకర్, సుమిత్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

రాజీనే.. రాజమార్గం

- ఈనెల 8న జాతీయ లోక్‌అదాలత్
- సద్వినియోగం చేసుకోవాలన్న ఎస్పీ



నిర్మల్‌టౌన్: రాజీనే రాజమార్గం అనే సూత్రాన్ని అనుసరించి వివాదాలను చక్కదిద్దుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఓ మంచి వేదిక. కోర్టులో లేదా వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే వేదిక. న్యాయవ్యవస్థలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈనెల 8న నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో జాతీయ లోక్ అదాల్ నిర్వహించనున్నారు. కక్షిదారులు కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా లోక్ అదాల్ ద్వారా రాజీకి వచ్చి సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చు.

కోర్టుకు ఎలా రావాలి..

1. మీకు తెలిసిన వ్యక్తులపై ఏమైనా కేసులు ఉంటే, వాటిని జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడానికి ఫిర్యాదు దారుడు, నిందితుడు ఇద్దరూ కోర్టుకు హాజరుకావాలి.
2. తమ ఆధార్ కార్డు తీసుకుని, సంబంధిత కోర్టులో హాజరు కావాలి.
3. రాజీ ప్రక్రియను పూర్తి చేసి, కేసును పూర్తిగా ముగించుకునే అవకాశం ఉంటుంది.

లోక్ అదాలత్‌తో లాభాలు..

- కేసుల సత్వర పరిష్కారం.. ఏళ్ల తరబడి సాగే న్యాయపరమైన చికాకుల నుంచి విముక్తి.
- సంఖ్యాబద్ధ(ఫార్మల్) కోర్టు ప్రక్రియ అవసరం లేదు.
- లీగల్ ఫీజు, కోర్టు ఖర్చుల తగ్గింపు.
- సులభమైన, తక్కువ ఖర్చుతో కూడిన శాంతి సాధన మార్గం.

రాజీ పడే కేసులు..

1. యాక్సిడెంట్ కేసులు
2. చీటింగ్(మోసం) కేసులు
3. కొట్టుకున్న కేసులు
4. వివాహబంధానికి సంబంధించిన కేసులు
5. చిన్నచిన్న దొంగతనం కేసులు
6. కరోనా సమయంలో నమోదైన కేసులు
7. డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం మత్తులో వాహనం నడిపిన కేసులు)
8. ఇతర రాజీపడదగిన కేసులు

సద్వినియోగం చేసుకోవాలి



కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అలదాత్ మంచి అవకాశం. వివాదాలు అనేవి ఒకసారి ప్రారంభమైతే.. జీవితాంతం కొనసాగుతూనే ఉంటాయి. వాటిని త్వరగా పరిష్కరించుకోవాలి. రాజీపడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి. జాతీయ లోక్‌అదాలత్ బాధితులకు మంచి అవకాశం. కేసులలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జానకీషర్మిల, ఎస్పీ

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

ముధోల్: రైతులకు సోమవారం ఏరువాక కేంద్రం, ముధోల్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఇ.నర్సయ్య, కే.విజయ్‌కుమార్, కార్తీక్‌లు రైతులకు విత్తనోత్పత్తిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎంఏ కోఆర్డినేటర్ రాజశేఖర్, ఎఫ్‌పీవో సభ్యులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ముధోల్: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పంచాయతీ సెక్రటరీ అన్వర్‌అలీ అన్నారు. సోమవారం గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరించి తరలించాలని సిబ్బందికి సూచించారు. చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్తబండిలోనే వేయాలని ప్రజలకు సూచించారు.